





కోటప్పకొండకు తరలివెళ్తున్న అమీన్‌సాహెబ్ పాలెం ప్రభలు

చేదుకో.. కోటయ్యా

నేడు మహాశివరాత్రి

మహాశివరాత్రి.. మహోత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో.. అంటూ భక్తులు శివయ్య దర్శనాలకు సిద్ధమయ్యారు. విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు కాంతులీనుతున్నాయి. స్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలకు కూడా ఏర్పాట్లు జరిగాయి. కోటప్పకొండ, వడ్లమూడి క్వారీ, గోవాడ క్షేత్రాలకు ప్రభలు ఆయా గ్రామాల నుంచి బయల్దేరాయి. ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ల శుక్రవారం నేత్రపర్వంగా జరగనుంది. వడ్లమూడి, గోవాడ క్షేత్రాల్లోని బాలకోటేశ్వరస్వామి ఆలయాల చుట్టూ పశువులు, జీవాలను తిప్పి కాపరులు మొక్కులు తీర్చుకున్నారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణోత్సవానికి కాకాని మల్లన్న సన్నిధిని ముస్తాబు చేశారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. శైవక్షేత్రాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు జరిగాయి.



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న కోటప్పకొండ ఆలయం

ప్రత్యేక అలంకరణలో శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్



కోటప్పకొండ తిరునాళ్ళకు తరలివస్తున్న భారీ విద్యుత్ ప్రభలు



విద్యుత్ కాంతు లీనుతున్న అమరేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం

అమరేశ్వరుని గ్రామోత్సవం

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం పులివాహనం, పల్లకిపై కన్నుల పండువగా జరిగింది. ఉదయం మండప పూజ, నిత్యోపాసన, రుద్రహోమం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జరిగే స్వామివారి దర్శనం, అభిషేకాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు లింగోద్భవకాల అభిషేకాలు, ఎదురుకోల ఉత్సవం, ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివార్ల కల్యాణోత్సవం జరుగుతుంది.

దేదీప్యమానంగా మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలకు పెదకాకాని మల్లన్న సన్నిధిని సర్వంసిద్ధం చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో శోభయమానంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం కోసం శీఘ్ర, లఘు, ఉచిత దర్శనాలకు అవసరమైన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణానికి ముస్తాబు చేశారు. ఏర్పాట్లను డీసీ దాసరి శ్రీరామవరప్రసాద్ పర్యవేక్షించారు.



విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న పెదకాకాని మల్లన్న సన్నిధి

- విద్యుత్ వెలుగుల్లో శైవక్షేత్రాలు
- తిరునాళ్లకు కోటప్పకొండ ముస్తాబు
- బాలకోటేశ్వరస్వామి దర్శనాలకు భక్తుల క్యూ
- నేటి రాత్రి మల్లన్న, అమరేశ్వరుని కల్యాణోత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 7: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరఫున కోటయ్య స్వామికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దేవాలయంలో ఏర్పాట్లను ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్ల నుంచి 528 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. సేవలు అందించేందుకు స్కౌట్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు కొండకు తరలి వచ్చారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం నుంచి ఒక్కొక్క ప్రభ కొండకు గురువారం బయల్దేరింది. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని నుంచి రెండు ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. భారీ ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేయనున్నారు.

వీఐపీలకు పెద్దపీట..

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్దపీట వేస్తున్నారు. కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలు ఉచితంగా అందించనున్నారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తోంది. ఆర్టీసీ కూడా వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసి వారి సేవకు సిద్ధమవగా, సామాన్య భక్తులను నుంచి ముక్కుపిండి అధిక చార్జీలను వసూలు చేస్తోంది.

క్వారీలో ప్రత్యేక పూజలు



క్వారీ తిరునాళ్లకు సిద్ధమైన నారా కోడూరు విద్యుత్‌ప్రభ, ఇన్‌సెట్లో పూజలందుకొంటున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి



చేబ్రోలు: వడ్లమూడి క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో గురువారమే తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. సమీప గ్రామాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానరహదారిపై ఆలయం ఉండటంతో తెనాలి, గుంటూరు మార్గంలో ట్రాఫిక్‌ను పలు మార్గాలో మళ్లించారు.

ఉత్సవాలు ప్రారంభం



గోవాడ ఆలయ విద్యుత్ ప్రభ



విద్యుత్ అలంకరణలో ఆలయ రాజగోపురం

అమృతలూరు, మార్చి 7: అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల దర్శనానికి సన్నద్ధం చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు నిర్మించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కులను భక్తులు చెల్లించారు. డీసీ బొంతు మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మురళీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగడం విశేషం. తెనాలి, బాపట్ల, రేపల్లె నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ సత్రాల్లో అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

దేవుడు.. యధార్థవంతుడు

- పాస్టర్ మోహన్ సీ లాజరస్
- ఘనంగా ప్రారంభమైన గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు), మార్చి 7: దేవుడు న్యాయవంతుడు, యథార్థవంతుడు అని పాస్టర్ మోహన్ సీ లాజరస్ వ్యాఖ్యోపదేశం చేశారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ గురువారం ప్రారంభమైంది. తమిళనాడు నుంచి వచ్చిన పాస్టర్లు మోహన్ సీ లాజరస్, మెల్బన్ లాజరస్, హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రమేష్, ఫ్రైడిపాల్, రాజు పండుగను ప్రారంభించారు. మోహన్ సీ లాజరస్, మెల్బన్ లాజరస్ గుడారాల పండుగకు వచ్చే ప్రతిఒక్కరూ భాగ్యవంతులు అని సందేశామిచ్చారు. 1977లో ప్రారంభమై నేడు లక్షలాది మంది విశ్వాసుల ప్రేమకు గుడారాల పండుగ చేరువైందన్నారు. అంతకముందు అమెరికా నుంచి వచ్చిన ఫాదర్ ఎర్నిస్ట్ పాల్ 'నిత్యతేజుడు ఏసయ్య' అనే పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. 'నిత్యతేజుడు ఏసయ్య' అనే అల్బమ్‌ను మదనపల్లి నుంచి వచ్చిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.





ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తున్న అబ్రహం, జాన్‌వెస్లీ, రాజు, ఫ్రైడిపాల్, రమేష్, గుడారాల పండుగకు హాజరైన విశ్వాసులు

సిద్ధం సభ ఏర్పాట్ల పరిశీలన

మేదరమెట్ల, మార్చి 7: కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద ఈ నెల 10న జరగనున్న సిద్ధం సభ వేదిక, గ్యాలరీ, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలను గురువారం రాత్రి గుంటూరు రేంజి ఐజీ పాలరాజు పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభకు సంబంధించిన అన్ని విభాగాలకు పోలీసు అధికారులను నియమించామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యే సభకు బందోబస్తు సిద్ధం చేశామన్నారు. సిద్ధం సభకు వచ్చే వాహనాలకు 28 చోట్ల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. జాతీయ రహదారి నుంచి వాహనాలను మళ్లించే ప్రతిచోటా అందరికీ అర్థమయ్యే రీతిలో పోలీసు సిబ్బంది పబ్లిక్ అడ్రసింగ్ విధానం ద్వారా సూచనలు చేస్తామన్నారు. సభా ప్రాంగణంలో ప్రవేశించే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలను సెక్టార్ల వారీగా విభజించి అందరూ సమన్వయంతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమాల్లో కమ్యూనికేషన్స్ ఎస్పీ రాజశ్రీ, ఏఎస్పీ పి.మహేష్, డీఎస్పీలు బేతపూడి ప్రసాద్, మురళీకృష్ణ, జగదీష్‌నాయక్, చంద్రమోహన్, స్వామిబాబు, సీఐలు వి.మల్లికార్జునరావు, శివరామకృష్ణారెడ్డి, కృష్ణయ్య, ఎస్ఐలు చంద్రశేఖర్, శివయ్య, శివకుమార్ తదితరులు ఉన్నారు.



సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ పాలరాజు

దొంగ.. దరఖాస్తులు

- ఓటు తొలగించాలంటూ ఫాం 7
- కొత్త పన్నాగంతో టీడీపీ ఓట్లపై వైసీపీ కన్ను
- టీడీపీకి పట్టు ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, మార్చి 7: నా ఓటు చేర్చండి అని దరఖాస్తు చేయడం సహజం.. అయితే అద్దంకి నియోజకవర్గంలో నా ఓటు తొలగించండి అని పెద్దసంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. అటు అధికారులు గందరగోళానికి గురవుతుండగా.. ఇటు ఓటర్లు తమకు తెలియకుండానే తమ పేరుతో అప్‌లోడు అవుతున్న దరఖాస్తులపై ఆందోళన చెందుతున్నారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించాలన్న ఉద్దేశంతో వైసీపీ నేతలు ఈ సరికొత్త పన్నాగానికి తెరతీశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆయా దరఖాస్తులపై పలుగ్రామాల టీడీపీ నేతలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్తున్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజవర్గ ఓటర్లను నిబంధనలకు విరుద్ధంగా అద్దంకి నియోజవర్గంలో చేర్చిన వైసీపీ నేతలు ఇప్పుడు టీడీపీకి పట్టు ఉండి ఎక్కువ మెజార్టీ వచ్చే అవకాశం ఉన్న గ్రామాలను ఎంపిక చేసుకుని ఓట్ల తొలగింపునకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో నియోజకవర్గంలో సుమారు 2 వేలకు పైగా సెల్ఫ్ డిక్లరేషన్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా బల్లికురవ, అద్దంకి మండలాల పరిధిలోని గ్రామాల్లో దొంగ దరఖాస్తులు చేసినట్లు టీడీపీ నేతలు తెలిపారు. అద్దంకి మండలం దేనువకొండలో 203, 204, 205 బూత్‌లలో సుమారు వందకు పైగా ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు అందినట్లు ఎన్నికల పర్యవేక్షణ అధికారులు ధ్రువీకరించడమే ఇందుకు నిదర్శనమని టీడీపీ నేతలు అంటున్నారు. వీటికి సంబంధించి దరఖాస్తులు ఇంకా ప్రాథమిక దశలో ఉన్నట్లు, ఇంకా అధికారుల వద్దకు కూడా రాలేదని సమాచారం. ఈ నెల 5 వరకు అందిన ఫాం 7లు 285 వరకు ఉన్నట్లు తెలుస్తుంది. పెద్దసంఖ్యలో సెల్ఫ్ డిక్లరేషన్ ఫాం 7లను ప్రత్యర్థులు దరఖాస్తు చేయడంపై టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి వేరే వ్యక్తుల పేర్లతో దరఖాస్తు చేసిన వ్యక్తులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు గుంటూరు - తెనాలి మార్గంలో

ట్రాఫిక్ మళ్లింపు

● వాహన చోదకులు సహకరించాలని ఎస్పీ వినతి

గుంటూరు, మార్చి 7 చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం ఉదయం వరకు తెనాలి - గుంటూరు మార్గంలో ట్రాఫిక్ దారి మళ్లిస్తున్నట్లు తెనాలి డిఎస్పీ రమేష్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి మరుసటి రోజు శనివారం ఉదయం 6 గంటల వరకు వుంటుందన్నారు. ఆయా వివరాలు ఇలా ఉన్నాయి.

- చేబ్రోలు - ముట్లూరు రోడ్‌లో: బాపట్ల, పొన్నూరు నుండి గుంటూరు వెళ్ళే వాహనాలను ముట్లూరు రోడ్డులోకి పంపించి, పాతరెడ్డిపాలెంలో ఉన్న లేమల్లెపాడు క్రాస్ రోడ్డు గుండా అనంతవరప్పాడు మీదుగా గుంటూరు వెళ్ళాలన్నారు.
- చేబ్రోలు లోని వడ్లమూడి అడ్డరోడ్డు నుంచి: బాపట్ల మరియు పొన్నూరు నుండి తెనాలి వెళ్ళే వాహనాలను చేబ్రోలు మసీద్ సెంటర్ లో ఉన్న వడ్లముడి అడ్డరోడ్డు గుండా, వడ్లమూడి గ్రామం గుండా తెనాలి వెళ్ళాలన్నారు. చేబ్రోలు ప్రజలు అనగా గుడికి వెళ్ళే వారు కూడా అదే రూట్ గుండా వెళ్ళాలన్నారు.
- వడ్లమూడి అడ్డరోడ్డు: తెనాలి నుండి పొన్నూరు వెళ్ళే వాహనాలను వడమూడి అడ్డరోడ్డు గుండా పొన్నూరు, చేబ్రోలు వెళ్ళాలన్నారు.
- తెనాలి ఫ్లై ఓవర్ : గుంటూరు కు వచ్చే బారి వాహనాలను నందివెలుగు రోడ్డు వైపు మళ్ళించామన్నారు. క్వారీ కి వచ్చేఆర్టీసీ బస్సులను మాత్రమే పంపాలన్నారు.
- బుడంపాడు ఫ్లైఓవర్ : గుంటూరు నుండి బాపట్ల పొన్నూరు వెళ్ళు వాహనాలను అనంతవరప్పాడు అడ్డరోడ్డు గుండా అనంతవరప్పాడు మరియు లేమల్లెపాడు గ్రామాలు మీదగా చేబ్రోలుకు వచ్చివెళ్ళాలన్నారు. గుంటూరు నుండి తెనాలి వెళ్ళు వాహనాలు నందివెలుగు రోడ్డు గుండా మాత్రమే వెళ్ళాలన్నారు. అదేవిధంగా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారి గుడికి వచ్చు భక్తులకు త్రీ వీలర్, టు వీలర్ వాహనాలను మాత్రమే నారాకోడూరు వైపు అనుమతిస్తామన్నారు. కాగా ఆయా వహన చోదకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు.

సొంత గూటికి మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ విజయ

● ఏపీసీసీ చీఫ్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

గుంటూరు,మార్చి 7: గుంటూరు మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన కూచిపూడి విజయ తన కుమారుడు కృష్ణకాంత్‌తో కలిసి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో గురువారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా షర్మిల పార్టీ కండువాతో వారిని కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిం చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతో కూచిపూడి సాంబశివరావుకు తొలి నుంచి మంచి స్నేహ సంబందాలున్నాయి. 2004లో వైఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూచిపూడి సాంబశివరావు దంపతులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు.



నగదు చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ ట్రస్టీ పీ.ప్రతీష

శంకర నేత్రాలయానికి రూ.10లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), మార్చి7 శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం లక్ష్మీపురంలో ఫౌండేషన్ ట్రస్టీ పి.పద్మాలక్ష్మీ ప్రతీష శ్రీ కంచి కామకోటి పీఠ మెడికల్ ట్రస్ట్‌కు చెక్కును ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పొట్టి సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో గత రెండు దశాబ్దాలకు పైగా వేలాదిమందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైతే శస్త్ర చికిత్సలు అందజేస్తున్నామని వివరించారు. భారీ విరాళాన్ని ఇచ్చి ఔదార్యత చాటుతున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి యూనిట్ హెడ్స్ సీహెచ్ త్రిపుర, ఎం.మాధవి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూల్.. ఫుల్

- మిర్చి టిక్కీలు శీతల గిడ్డంగుల బాట
- ఇప్పటికే 65 శాతం నిండిన కోల్డ్‌స్టోరేజ్‌లు
- చిన్నవి అయితే 100 శాతం నిండినట్లుగా బోర్డుల ఏర్పాటు
- మార్కెట్‌లో మిర్చి ధర తగ్గడమే మూలకారణం



కోల్డ్‌స్టోరేజీలో నిల్వ చేసేందుకు లారీల్లో తరలిస్తున్న మిర్చి టిక్కీలు



గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మిర్చి ధర తగ్గడంతో రైతులు చేసేది లేక తమ పంటని శీతల గిడ్డంగులకు తరలించడం ప్రారం భించారు. ప్రస్తుతం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనసాగుతున్న మిర్చి ధరలకు అమ్మితే తాము పూర్తిగా నష్టపోతా మనే నిర్ణయానికి రైతులు వచ్చారు. మిర్చి టిక్కీకి రూ.210 కోల్డ్ స్టోరేజ్ ఛార్జీ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచన చేయకుండా వాటిల్లో నిల్వచేస్తున్నారు. మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు తీసుకొచ్చి విక్ర యించుకొందామని భావిస్తున్నారు. పెట్టుబడి అవసరమైన రైతులు మాత్రంచేసేది లేక మార్కెట్‌లో లభిస్తున్న ధరకే మిర్చి విక్రయిం చేస్తున్నారు. ఇటీవలకాలంలో ఎప్పుడూ లేనివిధంగా సీజన్ మధ్య లోనే సరుకు కోల్డ్‌స్టోరేజ్‌లకు చేరుకోవడం ఇప్పుడే చూస్తున్నామని రైతులు, మిర్చి వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏబీ కేటిగిరీ కోల్డ్‌స్టోరేజ్‌లు 100శాతం నిండిపోయాయి. మిగతావాటిల్లో మాత్రం 65శాతం వరకు నిండుగా ఇంకా 35శాతం ఖాళీ ఉన్నట్లు కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు చెబుతున్నాయి.

విస్తారంగా పండిన మిర్చి..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క ప్రత్తిపాడు పరిసర ప్రాంతాలు మినహా అంతటా మిర్చి పంట ఈ ఏడాది విస్తారంగా పండింది. దిగుబడి బాగానే వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఇదేవిధంగా ప్రకాశం, కర్నూలు, కర్ణాటక, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోనూ మిర్చి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు జరిగింది. ఈ కారణంగా గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న సరుకు బయటకు వెళ్లకుండానే నవంబరు నుంచే రాయలసీమ జిల్లాలు, కర్ణాటకలోని బళ్లారి నుంచి మిర్చి సరుకు గుంటూరు మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చారు. కేవలం కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ వున్న సరుకు విక్రయం జరగాల్సిన నవంబరు, డిసెంబరు నెలల్లో కొత్త సరుకు రావడంవలన స్టోరేజ్‌లలో సరుకు అలానే ఉండిపోయింది. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 81 కోల్డ్‌స్టోరేజ్‌లు ఉండగా వాటిల్లో 71 మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో చాలా గిడ్డంగుల నిల్వ సామర్థ్యం లక్ష టిక్కీలుగా ఉన్నది. కొన్ని మాత్రం 40 వేల నుంచి 60 వేల మధ్యన ఉన్నాయి.

ధర తగ్గుదల ప్రారంభం

కాగా జనవరిలో సంక్రాంతి పండగ అయిపోగానే ఉమ్మడి గుంటూరుజిల్లా నుంచి రైతులు సరుకు తీసుకురావడం ప్రారంభిం చారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు ట్రేడింగ్ జరిగేంత డిమాండ్ లేకపోవడంతో ధర తగ్గడం ప్రారంభమైంది. మిర్చి తాలు కాయలకు తొలుత క్వింటాల్‌కు రూ.9 వేల ధర లభించింది. ఇప్పుడు రూ.7 వేలు మాత్రమే లభిస్తోంది. దీంతో రూ.9 వేల ధర మీద కొనుగోలు చేసిన వారు ఆ సరుకుని కోల్డ్ స్టోరేజ్‌లో పెడుతున్నారు. మరోవైపు మీడియం క్వాలిటీ రకాలైన 334, నెంబరు. 5, 273, 341, 4884, సూపర్ 10, ఆర్మూరు వంటి రకాలకు పెద్దగా డిమాండ్ లేదు. రకం, నాణ్యతని బట్టి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ.12 వేల ధర మాత్రమే ఎగుమతిదారులు ఆఫర్ చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో రూ.25 వేల వరకు ఉన్న తేజ, బ్యాడిగి వంటి మేలిమి రకాలు కూడా ఇప్పుడు రూ.18 వేలకు దిగి వచ్చాయి. ఈ ధర మీద విక్రయిస్తే రైతుకు పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావు.

రుణాలు చెల్లించలేక..

మార్కెట్‌లో మాంద్యం నెలకొన్న దృష్ట్యా రైతులు కోల్డ్ స్టోరేజ్‌ల వైపు చూస్తున్నారు. టిక్కీకి రూ.210, అక్కడికి రవాణ, దిగుమతి ఛార్జీలు అదనం అయినప్పటికీ శీతలగిడ్డంగికి తరలించి నిల్వ చేస్తున్నారు. కాగా గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన టిక్కీలకు చాలామంది రైతులు సహకార బ్యాంకులనుంచి రుణాలు తీసుకున్నారు. ఆరుణం చెల్లించలేకపోతున్నారు. దీంతో వారికి కొత్త రుణాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్తిపాడు పరిసరాలు, పల్నాడు, ఖమ్మం, వరంగల్ మార్కెట్‌ల పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ధర పెరగకపోతే మరో 20 రోజుల నుంచి నెల వ్యవధిలోనే శీతల గిడ్డంగులు నిండిపోతాయని వాటి యజమానులు చెబుతున్నారు. ఆ పరిస్థితుల్లో రైతులు తప్పక సరుకుని విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైతుంది. దాంతో ధర మరింత పతనమయ్యే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో మిర్చి ధర పడిపోకుండా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



నరసింహారావు(ఫైల్)

రాజుపాలెం,మార్చి7:పెట్టుబడి నిమిత్తం తీసుకున్న అప్పులు ఎక్కువై కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మొక్కపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాన్నబాల నరసింహారావు(38) పదేళ్ల నుంచి 12 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో దిగుబడి తక్కువగా వచ్చి రైతుల వద్ద పెట్టుబడి నిమిత్తం తీసుకున్న సుమారు రూ.60లక్షలకు వడ్డీ ఎక్కువైంది. అసలు, వడ్డీ ఎలాతీర్చాలో తెలియక మనస్తాపనకు గురై గురువారం తెల్లజామున తను సాగుచేస్తున్న పొలం వెళ్లి పురుగుల మందు తాగి బంధువులకు ఫోన్ చేసి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడు. కుటుంబసభ్యులు వెంటనే పొలం వెళ్లి చూశారు. నోటి నుంచి నురగరావటం గమనించి వెంటనే చికిత్స నిమిత్తం సత్తెనపల్లి తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయి వివరాలు తెలియజేస్తున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్

457కిలోల గంజాయి పట్టివేత

బాపట్ల, మార్చి 7: బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని హైవేబైపాస్ మీదుగా కంటైనర్‌లో గంజాయి తరలిస్తున్నట్లు గురువారం తెల్లవారుజామునసెబ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో జిల్లా సెబ్‌అధికారి జి.నరసింహారావు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఓ కంటైనర్‌లో 17బస్తాలలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ వాహనానికి పైలెట్‌గా వెళుతున్న కారును అదుపులోకి తీసుకొని కంటైనర్‌లో ఉన్న 17బస్తాలలోని 457కిలోల గంజాయిని సీజ్ చేశారు. దీని విలువ రూ.25లక్షలు ఉంటుందని జిల్లా సెబ్ అధికారి నరసింహారావు తెలిపారు. కంటైనర్ రాజమండ్రి నుంచి మచిలీపట్నం, రేపల్లె మీదుగా చెన్నై వెళుతున్నట్లు గుర్తించామన్నారు. వాహనంలోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా అందులో ఇద్దరు రాజమండ్రికి చెందినవారు కాగా ఒకరు చెన్నైకి చెందినవ్యక్తి అని తెలిపారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉందన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న తులసీ యోగీష్ తదితరులు

తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో

పోలీస్ సిబ్బందికి భోజన సదుపాయాలు

గుంటూరు, మార్చి7: మహాశివరాత్రి పురస్కరించుకొని కోటప్పకొండకు వచ్చే భక్తులకు భద్రత పర్యవేక్షించే స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, పోలీసులకు తులసీ సీడ్స్ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా తులసీ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్ గురువారం భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగీష్ మాట్లాడుతూ 13 ఏళ్ళుగా భక్తులసేవ, సహాయ కార్యక్రమాల నిమిత్తం కోటప్పకొండ తిరునాళ్ళ భద్రతకు విచ్చేసే పోలీస్ సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మహాశివరాత్రికి రెండు రోజుల ముందు నుంచి వరుసగా మూడు రోజుల పాటు ఈ సదుపాయాలు వారికి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. శిబిరంలో 500 మంది స్కౌట్స్, గైడ్స్ సిబ్బందికి, మరో 3 వేల మంది పోలీస్ సిబ్బందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పీ.శ్రీనివాసరావు, క్యాంపు కన్వీనర్ రాంబాబు, ఆఫీసర్ టీ.శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వీవీ హరనాథ్, ఎం.కృష్ణయ్య, షేక్ దావూద్ పాల్గొన్నారు.

డీఎస్పీకి జనసేన నేతల ఫిర్యాదు

మంగళగిరి, మార్చి 7: జనసేన పార్టీ కార్యాలయ సిబ్బంది నివాసాల్లో పోలీ సులు ఆకస్మిక సోదాలు నిర్వహించిన ఘటనపై జనసేన పార్టీ నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులు గురువారం రాత్రి గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ రవి కాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. లీగల్‌సెల్ కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ బుధవారం రాత్రి మంగళగిరి పట్టణ సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు మరికొందరు సివిల్‌డ్రెస్‌లో జనసేన సిబ్బంది నివాసం ఉంటున్న అపార్టుమెంటుకు వచ్చారని, గేటుతీయడం ఆలస్యం కావడంతో వాచ్‌మెన్ కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీతోపాటు డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీ రావు, చేనేత వికాస విభాగం రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

10న మేదరమెట్లలో సీఎం సభకు ఆర్టీసీ క్యూ..

● ఉమ్మడి జిల్లా నుంచి 601 బస్సులు సిద్ధం ● డిపోల్లో సగం బస్సులన్నీ సభకే
● ఇక ప్రయాణీకులకు చుక్కలే..

గుంటూరు, మార్చి 7:ప్రయాణీకుల నుంచి నిరసనలు, విమర్శలు ఎన్ని ఎదురైనా ఆర్టీసీ యాజమాన్యం అధికార వైసీపీ సేవలో తరిస్తోంది. మేదరమెట్లలో ఈనెల 10న అధికార వైసీపీ తలపెట్టిన సిద్ధం సభకు ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ సర్వీసులు పెద్ద ఎత్తున తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 601 బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్టీసీ అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు-1,2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 193, పల్నాడులోని మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ డిపోల నుంచి 264, బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, అద్దంకి డిపోల నుంచి 144 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నారు. సభ 10న అయినప్పటికీ ముందురోజు ఉదయం నుంచే బస్సులను కేటాయించిన ప్రాంతాలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రెండు రోజులు ప్రయాణీకులకు చుక్కలే....

ఆదివారం మేదరమెట్లలో సభ కావటంతో ముందు రోజు నుంచే కేటాయించిన ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను తరలించాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 601 బస్సులు కేటాయించటంతో ప్రయాణీకులకు బస్సులు అందుబాటులో లేక చుక్కలు కనిపించనున్నాయి.

మంగళగిరి డిపో నుంచి పల్లెవెలుగు సర్వీసులన్నీ సీఎం సభకే..

సీఎం సభ కోసం డిపోల వారీగా ఇప్పటికే అధికారులు బస్సులను కేటాయించారు. గుంటూరు-1 డిపో నుంచి 64, గుంటూరు-2 నుంచి 44, తెనాలి నుంచి 40, పొన్నూరు నుంచి 22, మంగళగిరి నుంచి 23 బస్సులను కేటాయించారు. కాగా మంగళగిరి డిపోలో అసలు పల్లెవెలుగు సర్వీసులుండే 24 కాగా 23 సర్వీసులను కేటాయించారు. అంటే ఒక పల్లెవెలుగు సర్వీసు మాత్రమే అందుబాటులో ఉంచనున్నారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థులకోసం అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024-25 రిజిస్ట్రేషన్ ప్రక్రి యని ప్రారంభించినట్లు గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీరులు వివిధ కేటిగిరీల రిక్రూట్‌మెంట్ కోసం joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకో వచ్చని సూచించారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీసు అసిస్టెంట్ / స్టోర్ కీపర్, ట్రేడ్స్ మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

అప్పుల ఆంధ్రాగా మార్చిన ఘనత జగన్‌దే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్,మార్చి 7: అక్షర క్రమంలో అభివృద్ధిలో ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండే ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మళ్ళీ గెలవటం సాధ్యం కాదన్న విషయం ఇప్పటికే జగన్‌కు అర్థమైందని, అందుకే దొంగ బిల్లులను డ్రా చేసుకొనేందుకు సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవటమేకాకుండా తాకట్టుపెడితేతప్పేంటని? సమర్థించుకోవటం సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. గ్రాఫిక్స్ భవనాలకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయా? అని ఆయన ప్రశ్నించారు. అప్పులు తెచ్చి అభివృద్ధి కాకుండా సొంత జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ ఎంత దొరికితే అంత అప్పు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల నెత్తిన ఒక్కొక్కరి పై రూ.2.04 లక్షల భారం మోపారన్నారు. అమరావతిలో మేం భవనాలు కడితే వాటిపై అప్పులు తెచ్చుకున్న జగన్ విశాఖలో నిజమైన గ్రాఫిక్స్ చూయించారని ప్రత్తిపాటి మండి పడ్డారు. వైజాగ్ అభివృద్ధి అంటూ చూపిన గ్రాఫిక్స్ రెండు కోడికత్తులను తిరగవేస్తే ఎలా ఉంటుందో అలానే ఉందన్నారు. మింగ మెతుకు లేదు గాని పిన్నమ్మకు గాజులు చేయిస్తానన్నట్లు విశాఖలో ఐకానిక్ బిల్డింగ్స్ కడతానని బడాయి మాటలు చెపుతున్నారని విమర్శించారు.



మందడం ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

అమరావతిపై వైసీపీ పాలకులకు అక్కసు

● 1542వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి7: అమరావతిని నాశనం చేయాలనుకోవటం పెద్ద తప్పిదమని రాజధాని కోసం 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1542వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మూడు ముక్కలాటకు సీఎం జగన్‌రెడ్డి స్వస్తి పలకాలన్నారు. ప్రజా రాజధాని అమరావతిని నాశనం చేయాలనుకోవటం మంచిది కాదన్నారు. మూడు పంటలు పండిస్తూ సాగు చేసుకునే భూమిని ప్రభుత్వం అడిగితే రాజధాని కోసం త్యాగం చేశామన్నారు. ఒక్క రూపాయి కూడా ఆశించలేదన్నారు. ఐదేళ్ల నుంచి మూడు రాజధానులంటూ రైతులను మానసిక క్షోభకు జగన్‌రెడ్డి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయికి వచ్చి ఎవరెవరు భూములిచ్చారో తె లుసుకోవాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



దైవ సందేశమందిస్తున్న విచారణ గురువులు జోసఫ్

సాగరమాత ఉత్సవాలు ప్రారంభం

విజయపురిసౌత్, మార్చి 7: మండలంలోని విజయపురిసౌత్‌లో వేంచేసిన సాగరమాత మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ, వాత్సల్యాలను భక్తులకు ప్రసాదించాలని గోరంట్ల విచారణ గురువులు గోపు జోసఫ్ ప్రార్థించారు. సాగరమాతను భక్తితో ప్రార్థిస్తే పాపాలు తొలగిపోతాయన్నారు. ఆలయాన్ని, జపమాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముందుగా సాగరమాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్‌బాలసాగర్, జోసఫ్ తంబి దివ్యబలిపూజలను నిర్వహించారు. గురుశ్రీ అల్లం చినశౌరెడ్డి దివ్యబలిపూజ, వాక్య పరిచర్య చేశారు. రాత్రి తేరు ప్రదిక్షణ గావించారు. సంసోను-డెలీల బుర్రకథ, రక్తబలి బైబిల్‌నాటకం ప్రదర్శించారు.

పీజీ పరీక్షలు వాయిదా

పెదకాకాని, మార్చి7: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. తిరిగి పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి యథావిధిగా కొనసాగుతాయన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి మార్పు లేదని ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహిస్తామని తెలిపారు.

1,44,649 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,25,293 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,44,649 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 89,789 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11000	19000
273	12300	15500
341	10000	19000
4884	11000	18500
సూపర్ 10	12500	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	10000	19000
తెల్లకాయలు	5000	12000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



సమావేశంలో మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ

అవినీతి, లంచాలకు తావులేకుండా పని చేస్తా

● టీడీపీ, జనసేన పార్టీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల రూరల్, మార్చి 7 : ఒక్క అవకాశం ఇవ్వండి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఒకమంచికి వ్యక్తికి ఓటు వేశారనే విధంగా కృషి చేస్తానని టీడీపీ, జనసేన పార్టీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. గురువారం బాపట్ల మండలం ముత్తాయపాలెం, పల్లెపాలెం గ్రామంలో తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో గ్రామసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం మీమాట-నాబాట కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 2,700 కిలోమీటర్లు నడిచాను. ప్రతికుటుంబాన్ని పలకరించానన్నారు. అవినీతి, లంచాలకు తావులేకుండా పనిచేస్తానని ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

బాపట్ల మండలం ముత్తాయపాలెం పల్లెపాలెంకు చెందిన నలుగురు వైసీపీ కార్యకర్తలు గురువారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. కొక్కిలిగడ్డ నాగరాజు, కొక్కిలిగడ్డ రాఘవరాజు, కొక్కిలిగడ్డ రాఘవేంద్రరావు, సంగాన సాంబయ్యలకు టీడీపీ కండువాలను కప్పి వేగేశన నరేంద్రవర్మ పార్టీలోకి స్వాగతం పలికారు.

అనగాని గెలుపునకు కృషి చేయాలి : గూడపాటి

రేపల్లె, మార్చి 7: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపునకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పూడి గ్రామంలో గురువారం మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బాపట్ల జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి తాతా ఏడుకొండలు, మాజీ సర్పంచ్ దామెర్ల రాజారావు, తెనాలి క్రాంతి సుమన్, జనసేన మండల అధ్యక్షులు రేపల్లె జానకిరామయ్య, శంకర్, టీడీపీ నాయకులు శ్యామ్‌బాబు, రేపల్లె సురేష్, రామకృష్ణ, సజ్జా ప్రసాద్, శివ, యలవర్తిలక్ష్మీ, జయప్రద, అరుణకుమారి, నాగశ్రీ, జ్యోతి పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం విశేష కృషి : కలెక్టర్

బాపట్ల, మార్చి 7 : మహిళాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని తద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత నగదు పంపిణీ కార్యక్రమాన్ని అనకాపల్లి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి గురువారం ప్రారంభించారు. బాపట్ల డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వీక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొని లబ్ధిదారులకు మెగాచెక్కు అందజేశారు. నాలుగో విడతగా జిల్లాకు రూ.165.10 కోట్లు వచ్చాయన్నారు.డీఆర్‌డీఏపీడీ సీహెచ్ కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మీడియాకు కీలకమైన బాధ్యత

ఎన్నికల్లో మీడియాకు కీలకమైన బాధ్యత ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఎల్‌ఈడీ ప్రొజెక్టర్ ద్వారా మీడియావారికి అవగాహన కల్పించారు. మీడియాకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య పాల్గొన్నారు.

మిషన్ లెర్నింగ్ అండ్ ఐవోటీపై శిక్షణ పూర్తి

బాపట్లరూరల్, మార్చి 7: బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో 5 రోజుల పాటు ఇంజనీరింగ్ ఉపాధ్యాయులకు మిషన్‌లెర్నింగ్ అండ్ ఐవోటీ అనే అంశంపై శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం కళాశాలలో నిర్వహించారు. ఈ శిక్షణకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ ఫిసిటెక్‌కు చెందిన ప్రతినిధులతో ఈసీఈ విభాగంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరి మానం నాగేశ్వరరావు, కళాశాల డీన్ అకాడమిక్స్ ఆచార్య సతీష్ మాట్లాడారు. వివిధ కళాశాలల విభాగాధిపతులు పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్‌శాఖ అధికారుల దాడులు

చెరుకుపల్లి, మార్చి 7 : మండలంలోని 16 పంచాయతీల్లో విద్యుత్‌శాఖ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ 44 బృందాలుగా ఏర్పడి అక్రమ విద్యుత్‌ను నిర్వహిస్తున్న 103 మందిపై కేసు నమోదు చేశారు. రూ.5 లక్షల 50వేలు అపరాధ రుసుం విధించామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ ఆంజనేయులు, ఏడీవో శ్రీనివాసులు, ఏఈ బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన టీడీపీ నాయకులు

కొల్లూరు, మార్చి 7 : అనారోగ్య కారణంగా చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త గోగినేని వెంకటేష్‌ను ఆ పార్టీ నాయకులు గురువారం రాత్రి పరామర్శించారు. కొల్లూరుకు చెందిన కార్యకర్త ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ వైద్యశాలలో చికిత్స పొందారు. డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చారని సమాచారం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ, పార్టీ నాయకులు కాసరనేని మోహన్, వెలివెల శ్రీరాములు, గద్దె నాగేశ్వరరావు, సూర్యదేవర పసి, కొల్లి నాగేశ్వరరావు, ఈడ్పు గంటి సుధాకర్ తదితరులు పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రేపల్లె, మార్చి 7: రాప్తాడులో జైభీమ్ రామ్ భారత్ పార్టీ నాయకులపై దాడి చేసి గుడిసెలను తగులపెట్టిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని జైభీమ్ రామ్ భారత్ పార్టీ రేపల్లె ఇన్‌చార్జ్ దోవ రమేష్‌రాంజీ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గుడిసెలను తగులపెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో పోతార్లంక శివ, వెంకటేశ్వరరావు, కర్రా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన రజక సంఘీయులు

భట్టిప్రోలు, మార్చి 7: రజక సామాజికవర్గాన్ని రానున్న రోజుల్లో ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామని ప్రకటించిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లకు మండల రజక సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక గ్రామపార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో రజక సంఘ నాయకులు పొనుగుపాటి పున్నారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన జయహో బీసీ భారీ బహిరంగ సభలో రెండు పార్టీల నాయకులు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా కృషి చేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ధూళిపూడి సాంబశివరావు, మునిపల్లి వెంకటేశ్వరరావు, పొనుగుపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల చట్టం అమలు చేయాలి : గోగన

బాపట్లటౌన్, మార్చి 7 : దివ్యాంగుల 2016 హక్కుల చట్టంను పూర్తి స్థాయిలో ప్రభుత్వాలు అమలు చేయాలని జనసేన పార్టీ దివ్యాంగుల జనసైనికులు గోగన ఆదిశేషు అన్నారు. గురువారం బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో దివ్యాంగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 9వ తేదీన అమరావతితో జరుగుతున్న దివ్యాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలన్నారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాసరెడ్డి, ఖగ్గా రామారావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, సుధాకర్, ఫణీంద్ర, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఏర్పాట్లు పూర్తి

అమృతలూరు, మార్చి 7: గోవాడ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే ఆర్యవైశ్యులకు బాలకోటేశ్వర కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య వై రంగనాయకుల శ్రేష్ఠి అన్నదానం సత్రంలో అన్నదాన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధ్యక్షులు సాంబశివరావు గురువారం తెలిపారు. ఈ ఉత్సవాలకు కృష్ణా, ప్రకాశం, జిల్లాల నుంచి ఎంతో మంది ఆర్యవైశ్యులు తరలిరానున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మధుబాబు మృతి

కర్లపాలెం, మార్చి 7: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ జాలాది మధుబాబు అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. మధుబాబు మృతదేహాన్ని ఎంపీపీ యారం వనజ, డ్వామా ఎండీ వై.పిచ్చిరెడ్డిలు గురువారం సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీవో మహేష్, మురళీ, శివయ్య, బి.రాంబాబు, సుధాకర్, వాసుదేవరావు, రేణుకుమార్, సాయిలు సందర్శించి నివాళులు అర్పించారు.

మూడు ఎకరాల వరి కుప్ప దగ్ధం

నగరం, మార్చి 7: మండలంలోని ధూళిపూడి గ్రామానికి చెందిన గొరికపూడి శామ్యూల్‌కు చెందిన 1.50 సెంట్లు, వెలగపూడి ఉదయ బాస్కర్‌కు చెందిన 1.50 సెంట్లు వరికుప్పలు బుధవారం రాత్రి దగ్ధమయ్యాయి. సుమారు రూ.60వేలు ఆస్తినష్టం వాటిల్లింది. రైతులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నగరం ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

చుండూరు మార్చి 7: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాన్ని ఏక కాలంలో ముందుకు తీసుకెళ్లగలిగిన సమర్థత గల ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు అని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం దుండిపాలెంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాలు అభివృద్ధి చెందాయంటే అది తెలుగుదేశం పాలన కాలంలో మాత్రమేనని ఆయన తెలిపారు. ఈ దుండిపాలెం మైనర్ గ్రామ పంచాయతీ అయిన రూ.4కోట్లతో రోడ్లు, గృహ నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో చేసి చూపామని ఆనందబాబు గుర్తు చేశారు. వైసీపీ ఈ ఐదు సంవత్సరాల పాలనలో కనీసం అభివృద్ధికి గ్రామాలు నోచుకోలేదన్నారు. జగన్ అప్పుడప్పుడూ సంక్షేమ పథకాలకు బటన్ నొక్కితే ప్రతి నిత్యం బాదుడు బటన్ మాత్రం నొక్కుతున్నాడు. దీని వల్ల ధరలు భగ్గుమంటున్నాయి, సామాన్యుడి కష్టాజీతాన్ని జగన్ పరోక్షంగా ఈ బటన్ నొక్కడం ద్వారా లాగేసుకుంటున్నారు. చివరికి వారి జీవితాను ఈ ఐదేళ్ళ కాలంలో పీల్చి పిప్పిచేశాడు. విజన్ ఉన్న నాయకుడు మన చంద్రన్న రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగాలన్నా, పరిశ్రమలు రావాలన్నా, ఉపాధి అవకాశాలు పెరగాలన్నా చంద్రబాబును తిరిగి సీఎం పీఠంపై కూర్చోబెట్టాలి. టీడీపీ పాలనలో రైతుల అభివృద్ధికి ప్రాధాన్యమివ్వడం జరిగింది. రైతు కుటుంబాలు పచ్చగా సంతోషంతో ఉండే వారు. నేడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. తిరిగి నవ్యాంధ్ర ప్రజలు సంతోషంగా ఉండాలన్నా తెలుగుదేశం, జనసేనల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. గ్రామానికి చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ముందుగా వేణుగోపాలస్వామి దేవస్థానంలో పూజల అనంతరం భారీ ర్యాలీతో గ్రామంలో ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డెరపాలెంకు చెందిన 30 కుటుంబాలు, యడ్లపల్లి ముస్లిం కాలనీకి చెందిన 35 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంటరి కమీటి ఉపాధ్యక్షులు తమ్మా శివారెడ్డి, గూదేటి ఎల్లారెడ్డి, శ్రీమాన్, కంఠంనేని రాహుల్, జనసేన వేమూరు నియోజకవర్గ ఊసా రాజేష్, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, పోకల శ్రీనివాసరావు, వివిఎస్‌కె ప్రసాద్, గూదేటి బాలకోటిరెడ్డి, దేవిరెడ్డి నాగేశ్వరరావు, కుర్రి వెంకటరెడ్డి, కేశం శ్రీనివాసరావు, ఆళ్ళ సుబ్బారెడ్డి, దేవిరెడ్డి సుబ్బారావు, వెంకటరెడ్డి, కావూరి శ్రీనివాసరావు, కుక్కల శ్రీనివాసరెడ్డి, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథంపై ఆనందబాబు తదితరులు

మహాశివరాత్రికి శైవక్షేత్రాల ముస్తాబు

● దక్షిణకాశీగా పేరొందిన మోర్తోట
● కోర్కెలు తీర్చే ముక్తేశ్వరస్వామి
● విద్యుత్ దీపాలతో అలంకరణ

రేపల్లె, మార్చి 7: కృష్ణానది తీరం వెంట రేపల్లె మండలం మోర్తోటలో ఉన్న గంగాపార్వతి సమేత ముక్తేశ్వర స్వామి దేవాలయం (దక్షిణ కాశీ)కు 1400 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. ముక్తేశ్వరక్షేత్రం భక్తులకు మహిమలు చూపుతూ కొంగు బంగారమైంది. మోర్తోటలోని అత్యంత పురాతన దేవాలయ స్థల పురాణం ఆసక్తి కలిగిస్తుంది. కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల్లో ప్రగాఢ విశ్వాసం పెరిగింది. గంగాపార్వతి సమేత మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా మార్చి 8వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున మూడుగంటలకు మేలుకొలుపు, 11 రుద్రాల అభిషేకాలు మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగును. సాయంత్రం 6గంటలకు జగాజ్యోతి, మహా దీపారాధన, 7 గంటలకు స్వామి-అమ్మవార్ల ఎదుర్కోలు సన్నాహం, 7.30గంటలకు శివపార్వతులకు కల్యాణ మహోత్సవం, 9 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగును. మార్చి 10వ తేదీ గ్రామోత్సవం, రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.



ప్రత్యేక అలంకరణలో ముక్తేశ్వరస్వామి మూలవిరాట్

కొల్లూరు, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని కోటిపల్లి సోమశేఖరస్వామి దేవస్థానం, చిలుమూరులోని శ్రీరామేశ్వర క్షేత్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు గావించారు. ఆయా గ్రామాల్లో సైతం శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. తెల్లవారు జాము నుంచే స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

బాలకోటేశ్వరస్వామి దేవస్థానం...

భట్టిప్రోలు, మార్చి 7: భట్టిప్రోలులో ఉన్న అతి పురాతనమైన దేవాలయం దక్షిణముఖ శివాలయంగా చరిత్రగాంచిన కంచి కామాక్షి సమేత బాలకోటేశ్వరస్వామి దేవస్థానం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. పంచామృతాలతో అభిషేకాలు అనంతరం శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. చేదుకో కోటయ్యా చేదుకో అంటూ తమ పశు సంపదను దేవాలయం చుట్టూ ప్రదక్షిణ లు చేయించుకునేందుకు దేవాలయం ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. అదేవిధంగా మండలంలోని వెల్లటూరులో ఉన్న బాలాత్రిపుర సుం దరీ సమేత అగస్త్యేశ్వర స్వామి, గంగాపార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి త్రయాహ్నిక దీక్ష దివ్య కల్యాణ మహోత్సవాలు శివరాత్రి నుంచి ఘనంగా ప్రారంభమవుతాయని కార్యనిర్వహణాధికారి దీవి వెంకటప్పలాచార్యులు తెలియజేశారు. ఉత్సవాల్లో భాగంగా 7న స్వామివార్లను పెండ్లి కుమారుని చేయుట, రాత్రి ధ్వజారోహణ, 8న బలిహరణ, జగజ్యోతి, ఎదురుకోలోత్సవము అనంతరం స్వామివార్ల కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహిస్తున్నామన్నారు. 9న శనివారం సాయంత్రం కల్యాణమూర్తులైన స్వామివార్ల దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుందని కార్యనిర్వహణాధికారి వివరించారు.

పిట్టలవానిపాలెం మండలంలో..

పిట్టలవానిపాలెం, మార్చి 7: మండలంలోని చందోలులో ఉన్న లింద్భోవస్వామి ఆలయంలో 100 సంవత్సరాల సాలగ్రామ చింతమణి శిలతో కూడిన లింగోద్భవమూర్తిని, విజయేశ్వరలింగం, తాండేశ్వరలింగం ఈలింగాలు ఈ ఆలయంలో అత్యంత పేరుగాంచినవని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. మంతెనవారిపాలెం రామలింగేశ్వరస్వామి ఆలయంలో, ఖాజీపాలెం శ్రీకాశీ విశ్వనాధ స్వామి దేవాలయంలో, అల్లూరులోని రెడ్లపాలెంలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న ట్లు ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు తెలియజేశారు.

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర : కలెక్టర్



బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల,మార్చి 7 : అన్నింటిలో సగభాగమైన మహిళలు సమాజాభివృద్ధిలో కీలకపాత్రపోషిస్తున్నారని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. మహిళ, శిశుసంక్షేమశాఖ, ఏపీజేఏసీ అమరావతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటపాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేసి మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ సమాజం, కుటుంబ వ్యవస్థలో మహిళల నిర్వాహణ ,బాధ్యత, తెలివితేటలు పరిణామం వర్ణించలేనిదన్నారు. సమాజం ముందుకెళ్ళటానికి మహిళలు చేస్తున్న కృషి అబి నందనీయమన్నారు. కార్యక్రమంలో బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు గంధం రవీందర్, హేలాషా రోను, ఐఈడీఎస్ పీడీ ఉమా, ఎస్‌ఈ సంక్షేమ సాధికారిత అధికారి జె.రాజాదేబోరా, డీపీఆర్‌వో సహాయసంచాలకులు కె. సుబాషిణి, ఏపీఎం ఐపీ పీడీ వెంకటరణ, సీడీపీవో బిశైలజ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ..

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఆర్ఎం యూనివర్సిటి అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని నేటి మహిళలు అన్ని రంగాల్లో ప్రముఖపాత్ర వహించాలని, ఆకాశమే హద్దుగా ప్రగతిపథంలో ముందుకుసాగాలన్నారు. న్యూట్రీషియన్లు కార్తీక్, పూజిత మాట్లాడుతూ మహిళలు కెరీర్ మీదే కాకుండా ఆరోగ్యం, ఆహారం మీద కూడా దృష్టిసారించాలన్నారు.

స్త్రీశక్తి భవనంలో...

మహిళలు స్వశక్తితో నైపుణ్యాభివృద్ధితో తమ ప్రతిభను వెలికి తీస్తేనే నిజమైన సమానత సాధించినట్లవుతుందని డాక్టర్ జాగర్లమూడి లక్ష్మి పేర్కొన్నారు. స్త్రీశక్తి భవనం నందు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో...

బాపట్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గురువారం అం తర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీవో బిశైలజ, సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

మండల సమైక్య కార్యాలయంలో...

మండల సమైక్య ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవా న్ని ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటపాటలు ఏర్పాటు చేశారు. మం డలసమైక్య అధ్యక్షురాలు గాలి కరుణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్, సీసీ సుమలత, చెంచురావమ్మ, వీవోఏలు, గ్రామసమైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బాపట్ల వ్యవసాయ కళాశాలలో..

బాపట్ల రూరల్, మార్చి 7: మహిళా శక్తిని గుర్తించిన దేశాలు మాత్రమే ముందంజలో ఉన్నాయని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ డి.ప్రమీలారాణి అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళా హక్కులను సాధించటంలో స్త్రీపాత్ర గణనీయమని ఇది శతాబ్దాల పోరాట ఫలితమని ఈ ఉద్యమం ద్వారా స్త్రీశక్తి విశ్వమంతా విజయపతకాలను ఎగురవేసిందన్నారు. సభకు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో..

బాపట్ల మండల ప్రజాపరిషత్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడీవో కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురవారం జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు కోట వెంకేటశ్వర్లురెడ్డి మహిళలను ఘనంగా సన్మానించారు.

● బాపట్లటౌన్, మార్చి 7: బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీఈజీకే మూర్తి తెలిపారు.

కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో..

కర్లపాలెం, మార్చి 7 : కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో మండల సమైక్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు ప్రతిఒక్కరు అన్నిరంగాల్లో ముందడుగు వేసి ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఎంపీపీ యారం వనజ అన్నారు.

కొల్లూరు మండలపరిషత్ కార్యాలయంలో..

కొల్లూరు, మార్చి 7: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజకీయ, ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళలను సత్కరించారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, సీడీపీవో విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ ఉప్పు శిరీష, ఆర్ఐ త్రివేణి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నగరాజకుమారి తదితరులను సత్కరించారు. సచివాలయ, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను మెమోంటోలతో సత్కరించారు.

భట్టిప్రోలు మండలంలో..

భట్టిప్రోలు, మార్చి 7 : సీఐటీయు, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహి ళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కేఎస్‌కే బాలికల జూనియర్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని బాలికలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల మధ్య జరిపారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ రామలక్ష్మిని, పల్లెకోన అంగన్వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, షజురిన్నిసా, కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, వెల్లటూరు జిల్లాపరిషత్ హైస్కూలు హెచ్‌ఎం కె.అరుణకుమారిలను సత్కరించారు.

వేమూరులో...

వేమూరు, మార్చి 6 : మహిళలు అన్ని రంగాల్లో చైతన్య వంతులు కావాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక రోశయ్య మీటింగ్ హాల్లో మహిళలతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధ అధ్యక్షత న జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలోనూ స్త్రీ పాత్ర ప్రధానమైందని ఆమె ద్వారానే ఆర్థిక స్థితిగతులు ఆధారపడి ఉంటాయని అన్నారు. జడ్పీటీసీ గాజుల హేమలత మాట్లాడుతూ మహిళా చట్టాలను సక్రమంగా అమలుపరిస్తే మహిళ లు మరింతగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందగలుగుతారని అన్నా రు. కార్యక్రమంలో రెండు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయాలు మండల పరిషత్ కార్యాలయం పంచాయతీ శాఖ మండల సమైఖ్య అంగన్‌వాడీ తదితర శాఖల్లో పని చేసే ఉద్యోగులను సత్కరించారు.

చెన్నమల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్, ఉల్లిపాలెం జమీందార్

రేపల్లె, మార్చి 7: నగరం మండలం ఉల్లిపాలెంలో చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని భోగి సందర్భం గా ఆలయంలో ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈపూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, ఉల్లిపాలెం జమీందార్ పూజల్లో పాల్గొన్నారు. 41రోజులు శివస్వాము లు శివదీక్షలు కఠిక నియమ నిబంధనలతో ఆచరించి గురువారం ఇరుముళ్ళు కట్టుకుని శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి బయల్దే రారు. ఈ ఇరుముడి పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ అందించిన రూ20వేలు విరాళాన్ని సోదరుడు శివప్రసాద్ ఆలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, నాగళ్ళ శ్రీహరి, ఎన్.సురేష్, యోగానంద్, యార్లగడ్డ చిన్నబాబు, దండమూడి ధరణికుమార్, దేవగిరి రవి, తదితరులు పాల్గొన్నారు. నగరం మండలం పెద్దపల్లి శ్రీనగర్‌లో నాగమ్మతల్లి తిరునాళ్ళ మహోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామస్థులు అమ్మవారికి సారెతోపాటు సద్దినైవేద్యాలు సమర్పించారు. అలాగే కుంకుమపూజలు వందలాది మంది మహిళలు పూజల్లో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు.













నాకు నేనే కొత్తగా అనిపించా

సుహాస్



సుహాస్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కథానాయికలు. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అర్జున్ వై.కె. దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.ఎస్.మణికంఠ, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన టీజర్ రిలీజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'సుహాస్‌కి చాలా కీలకమైన సినిమా ఇది. కథలోని పాయింట్ అదిరిపోయింది. టీజర్ చాలా బాగుంది. తప్పకుండా హిట్ అవుతుంది' అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఫేస్ బ్లైండ్ నెస్ మీద తీస్తున్న మంచి థ్రిల్లర్ ఇది. బాగా వచ్చింది. ఇందులో నాకు నేనే కొత్తగా అనిపించాను. నిర్మాతలు మణికంఠ, ప్రసాద్ ఎంతో కష్టపడ్డారు. ఇది పక్కాగా బ్లాక్‌బస్టర్ అయ్యే సినిమా. అందులో డౌట్ లేదు' అన్నారు. ఈ కథకు సుహాస్ యాప్ట్ అని దర్శకుడు అర్జున్ తెలిపారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. హీరోయిన్లు పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాధికకు విశిష్ట మహిళా పురస్కారం



సీనియర్ నటి రాధికకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2024 విశిష్ట మహిళ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాధికను సన్మానించి పురస్కారం ప్రదానం చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం తెలిపారు. మంచి నటిగానే కాకుండా నిర్మాతగా కూడా పేరు తెచ్చుకున్న రాధిక తెలుగు, తమిళ చిత్రాలతో పాటు బుల్లి తెరపై కూడా రాణిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెదకాకాని

అన్ని రకాల ఎమోషన్స్‌తో...



యూత్‌ఫుల్ చిత్రాల నిర్మాత బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జంతో కలసి రూపొందిస్తున్న చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా, ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ఖరారు చేస్తూ బుధవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా ఇది. ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు విక్రమ్ మాట్లాడుతూ "దర్శకుడిని కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ చిత్రంతో తీరుతోంది. ఇది అందరూ అనుకున్నట్లు కేవలం ఎంటర్టైనర్ మాత్రమే కాదు.. అన్ని రకాల ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి" అని అన్నారు.













హరహర మహాదేవ..

- నేడు మహాశివరాత్రి
- ముస్తాబైన శైవాలయాలు

చినగంజాం, మార్చి 7: మహాశివరాత్రి పర్వదినానికి శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. మండలంలోని సంతరావూరు గ్రామంలోని పురాతన దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీలో వేంచేసియున్న బాలకోటేశ్వర స్వామి ఆలయం, చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసియున్న లలితాపరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయాల వద్ద శుక్ర వారం మహాశివరాత్రి పర్వదినాన్ని కనులవిందుగా చేసేందుకు ఆలయాల నిర్వహణ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. మహాశివరాత్రి తిరునాళ్లను జిల్లాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మండలంలోని సోపిరాల, కొత్తపాలెం గ్రామాల్లో ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. గుంటూరు జిల్లా కోటప్పకొండ తరువాత చినగంజాం మండలంలో నిర్వహించే తిరునాళ్లకు అంతంటి ప్రసిద్ధి పొం దింది.

కొత్తపాలెం గ్రామ పంచాయతీలోని శ్రీబాలకోటేశ్వర స్వామి స్వయంభు కాగా భక్తుల కోర్కెలను తీర్చే స్వామిగా ఈ ప్రాంతంలోని వారికి ప్రగాఢ విశ్వాసం ఉంది. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఒక సామాజిక వర్గానికి చెందిన వారిచే అత్యంత వైభవంగా మహాశివ రాత్రి తిరునాళ్ళ జరుగుతుండేది. కాలక్రమంలో ఒక వర్గం సోపిరాల గ్రామంలో ఐదు దశాబ్దాల క్రితం రామకోటేశ్వరస్వామి ఆలయాన్ని ఏర్పాటుచేసి పోటాపోటీగా తిరునాళ్లను నిర్వహిస్తున్నారు. గ్రామంలో గుడి నిర్మించిన తరువాతనే గ్రామాభివృద్ధి చెందిందని గ్రామస్థుల నమ్మకం. శుక్రవారం తెల్లవారుజాము 3గంటల నుంచి ఆలయాల వద్ద స్వామి వారికి అభి షేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ప్రారంభమయ్యే తిరునాళ్ల మరుసటి రోజు ఉదయం వరకు వివిధ రూపాలలో కార్యక్రమాలు కొనసాగుతూ ఉంటాయి.



కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం

బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆరు భారీ విద్యుత్ ప్రభలు, రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద నాలుగు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటుచేసి జబర్దస్త్, శ్రీదేవి డ్రామా కంపెనీ, ఢీటీమ్ కళాకారులచే కార్యక్రమాలు, సినీ మ్యూజికల్ నైట్, మిమిక్రీ, పౌరాణిక నాటకాలతో పా టు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయాల కమిటి సభ్యులు తెలిపారు.

మార్టూరు: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మార్టూరులోని నేతాజీనగర్ సమీపంలోగల శ్రీఘట్టేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, విశిష్ట అభిషేకాలు నిర్వహించనున్నట్లు అర్చకులు నార్నెపాటి సాంబశివరావు తెలిపారు. రాత్రి జాగరణలో భాగంగా శ్రీసాయికృష్ణ కోలాట బృందం మహిళలు, మార్వాడికి చెందిన భక్తులు గానాలాపనతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే, గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద మధ్యాహ్నం శ్రీమ ద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



సోపిరాలలోని రామకోటేశ్వరస్వామి ఆలయం

తిరునాళ్లకు భారీ బందోబస్తు

చినగంజాం, మార్చి 7: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని సోపిరాల రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయాల వద్ద శుక్రవారం నిర్వహించే తిరునాళ్లకు భారీ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం

చినకాశిగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరం

అద్దంకి, మార్చి 7: మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయం చినకాశీగా ఖ్యాతికెక్కింది. కాశీలో ఉన్నవిధంగానే మణికేశ్వరంలో కూడా దేవాలయ పరిసరాలు ఉండటంతో ఆ పేరు వచ్చినట్లు నానుడి. కాశీలో గంగా నది తూర్పు నుంచి పడమరకు ప్రవహించే విధంగానే మణికేశ్వరం దేవాలయం వద్ద గుండ్లకమ్మ నది కూడా తూర్పు నుంచి పడమరకు ప్రవహిస్తుంది. కాశీలో ఉన్న విధంగానే శ్మశానం కూడా దేవాలయం ముందే ఉంది. కాశీలో మాత్రమే కనిపించే బూరగ వృక్షాన్ని పోలిన చెట్టు ఇటీవలవరకు మణికేశ్వరం దేవాలయం ముందు కూడా ఉంది. లైలా తుఫాన్ సమయంలో ఎండిపోవటంతో తొలగించారు.

కాగా, శివరాత్రికి మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవాలయం చైర్మన్ ఈదా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఈవో కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 11 గంటలకు లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతుందని తెలిపారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాల గుడి, కమఠేశ్వరాలయంతోపాటు ఇతర పలు శివాలయాలలో కూడా ప్రత్యేక పూజాకార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లుచేశారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పంగులూరు, మార్చి 7: దాతలు అందించే సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగ పరచుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.నాగమణి కోరారు. మండలంలోని బూదవాడ ఉన్నత పాఠశాల పదో తరగతి బాలబాలికలకు నర్రా వెంకటేశ్వరరావు, లక్ష్మీసుద దంపతులు సమకూర్చిన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్‌తో పాటు స్కేల్స్‌ను సమకూర్చారు. ఈ పరికరాలను పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, సదానందరెడ్డి పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, సోమశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుచేయాలి

చినగంజాం, మార్చి 7: ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిష్పక్షపాతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందని తహసీల్దార్ ఫణీంద్రబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై గ్రామ కార్యద ర్శులు, వీఆర్వోలు, పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారులు, స్టాటిస్టిక్స్ టీమ్ అధికారులకు గురువారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి, పంచాయతీరాజ్, హౌసింగ్ ఏఈలు డి.దాసు, రాజశేఖర్, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

'స్వయం కృషితో ఆర్థిక స్వావలంబన'

పర్చూరు, మార్చి 7: మహిళలు స్వయంకృషితో ఆర్థిక స్వావలంబన సాధించాలన్న సంకల్పంతో రోటరీ అధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేయటం అభినందనీయమని వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న అన్నారు. గురువారం స్థానిక రోటరీ భవన్‌లో కుట్టుమిషన్ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైస్ఎంపీపీ మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న మహిళలు బ్యాంకు రుణాలు పొందేందుకు సర్టిఫికెట్లు ఎంతగానో దోహద పడతాయన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, కోటా శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, గడ్డిపాటి శ్రీనివాసరావు, కోడూరి సుబ్రహ్మణ్యాచారి పాల్గొన్నారు.





చట్టాలపై మహిళలు అవగాహన కలిగిఉండాలి

పర్చూరు, మార్చి 7: మహిళల అభివృద్ధి, రక్షణ కోసం రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.ప్రశాంతి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన ముందస్తు మహిళా దినోత్సవం కార్యక్రమానికి సీడీపీవో సుభద్ర అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయాధికారి మాట్లాడుతూ మహిళలు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సీడీపీవో సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశా యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమెన్స్ హెల్ప్‌లైన్ 181 గురించి వివరించారు. అనంతరం స్థానిక కార్యాలయం నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామాలలో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలి

యద్దనపూడి(మార్టూరు), మార్చి 7: గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం కోరారు. గురువారం జరిగిన యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఏర్పడితే ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పూనూరు ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద చేతి పంపు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ వంకాయల పాటిసునీత కోరారు. తనుబొద్దివారిపాలెం, చిమటావారి పాలెం రోడ్డులో చిల్లచెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని సర్పంచ్‌లు గనిపిశెట్టి వెంకాయమ్మ, చల్లా అన్నపూర్ణమ్మ కోరారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఏపీఎం రమేష్, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



బీసీల అభివృద్ధే టీడీపీ లక్ష్యం



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, మార్చి 7: జయహో బీసీ మహాసభ సందర్భంగా టీడీపీ, జనసేనలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్ చరిత్రాత్మకమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. బీసీ డిక్లరేషన్ నేపథ్యంలో గురువారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ తెలుగుదేశం అంటే బీసీ అని, బీసీ అంటే తెలుగుదేశమనే నానుడికి అనుగుణంగా బీసీల శ్రేయస్సు కోసం బీసీ డిక్లరేషన్‌లో పొందుపరిచిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యం

సంతమాగులూరు, మార్చి 7: సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం పాతమాగులూరుకు చెందిన మాజీ ఉప సర్పంచ్ దేగల శ్రావణి, జిర్రా బక్కయ్య చల్లా సుబ్బారావు, యన్నం అచ్చయ్య, తదితరులు ఎమ్మెల్యేను చిలకలూరిపేటలోని ఆయన నివాశంలో కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం మన బిడ్డల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని అన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చెప్పారు. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అరాచక పరిపాలనను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తిచేయలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు గాయాలు

మేదరమెట్ల, మార్చి 7: మేదరమెట్లలోని ప్రయివేటు పాఠశాల వద్ద బస్సు ఢీకొని మోటారుసైకిలిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు ఢీకొనడంతో కుడికాలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు.

నియోజకవర్గ అభివృద్ధిలో ముందుంటాం..

చీరాల, మార్చి 7: నియోజకవర్గంలో అభివృద్ధిలో ముందుంటాం.. అందరికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కరణం బలరామకష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్ అన్నారు. స్థానిక ఎల్‌బీఎస్ నగర్ షాదీఖానాలో గురువారం ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ముందున్నామన్నారు. ఎమ్మెల్యే బలరాం, వెంకటేష్‌ను ముస్లిం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, షేక్ సలీమ్, షేక్ మొహిద్దీన్, షేక్ హుమాయూన్ కబీర్, షేక్ అల్లాబక్షి, అబ్దుల్ రహీమ్, వలీ, షేక్ నాగూర్‌భాషా, షేక్ సుభాని, జిలాని, జాకాబ్, యామిన్, సయ్యద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

స్థానిక మసీదు సెంటర్లో నిర్మాణంలో ఉన్న డ్రైయిన్, రోడ్డు నిర్మాణ పనులను వెంకటేష్ పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని నిర్మాణదారులకు చెప్పారు. దేవాంగపురి పంచాయతీ పరిధిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని, రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వెంకటేష్ ప్రారంభించారు. దీంతోపాటు గ్రామంలో రూ.7.41 లక్షల వ్యయంతో పూర్తిచేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



కేకు కట్ చేస్తున్న తహసీల్దార్ సుశీల, మహిళా అధికారులు

మేదరమెట్ల, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ బి.సుశీల అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా సందర్భంగా కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద కేకు కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీల మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో చాలా వరకు మహిళలు ఉద్యోగాల్లో రాణిస్తున్నా.. ఇంకా కొంత వివక్ష కొనసాగు తూనే ఉందన్నారు. పార్లమెంట్‌లో పెట్టిన మహిళా బిల్లు అమలులోకి వస్తే మహిళలు మరింత ముందడుగు వేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కస్తూరి, ఏపీఎం అనూరాధ, పంచాయతీ కార్యదర్శి దుర్గాభవాని, ఏపీఎం కోటేశ్వరి, పలువురు మహిళా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు పలువురు మహిళా అధికారులను సత్కరించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



సెయింట్‌ఆన్స్ కళాశాలలో కేక్ కట్‌చేస్తున్న కళాశాల ఫౌండర్ వనమా వెంకటేశ్వరరావు

చీరాల, మార్చి 7 : సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ విభాగం ఆధ్వర్యంలో నిరహి ంచిన కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ వనమా వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తిని ప్రతిఒక్కరూ గుర్తించి గౌరవించాలన్నారు.

కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, డాక్టర్ శ్రీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు, డాక్టర్ ఆర్.ధనలక్ష్మి, డాక్టర్ లక్ష్మీతులసి చావలి, డాక్టర్ బబితజైన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, మార్చి 7: స్థానిక భూసమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో, మున్నం వారిపాలెం ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనితా క్లబ్ సభ్యులు చినగంజాం వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారికి వనితా క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం మహిళలకు పలు రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళా కానిస్టేబుల్స్ కవిత, సుబ్బరామ్మను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వనితా క్లబ్ జోన్ చైర్మన్ పొట్టి శైలజ, అధ్యక్షురాలు కె.సుచిత్ర, కార్యదర్శి బి.జ్యోతి, కోశాధికారి ఎం.శేషకుమారి, సభ్యులు నూనె రమాదేవి, అమరా కేదారి, కందేపి సుభాషిణి, బొమ్మిశెట్టి రాజ్యలక్ష్మి, అమరా నాగలక్ష్మి, వలివేటి లక్ష్మీలు పాల్గొన్నారు.

మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయురాలు పి.హిమవంతేశ్వరి, మధ్యాహ్న భోజన నిర్వాహకులు సుబ్బారావమ్మ, రాజమ్మను పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరావు, ఎన్.చంద్రశేఖర్, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్పీ సీహెచ్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

అద్దంకిలో.. అద్దంకి, మార్చి 7: శింగరకొండ వద్ద ఉన్న కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకురాళ్ళను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థినులకు పరిమళ ఫౌండేషన్ తరఫున పరీక్షా ప్యాడ్‌లు అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాళ్ళు సుంకర శ్రీదేవి, గొట్టిపాటి శ్రీదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీవీ కృష్ణారెడ్డి, హెచ్ఎం కటకం శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

చీరాలటౌన్, మార్చి 7: యువతీ యువకులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ రెహనా పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నీలాకుమారి, న్యాయవాదులు వినీల, ఈశ్వరరెడ్డి, పీఎల్వీ మతీన్, కళాశాల కోఆర్డినేటర్ ఫౌజియా, ఏఎస్సై వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

పూసపాడు(ఇంకొల్లు), మార్చి 7: మండలంలోని పూసపాడు ఎస్‌కేపీవీఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులకు గురువారం పర్చూరు రోటరీక్లబ్ పరీక్షా సామగ్రి అందజేసింది. రోటరీ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి సదానందరెడ్డి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అవసరమైన పరీక్షా సామగ్రి అందజేసి పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు కె.శ్రీనివాసరావు, ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతపై దృష్టి సారించాలి

చీరాలటౌన్, మార్చి 7: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదువులపై దృష్టిసారించాలని ఎంఈవో సుబ్రహణ్యేశ్వరరావు అన్నారు. యలమంచిలి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్, విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల ఆధ్వర్యంలో గత కొద్దిరోజులుగా చీరాల, వేటపాలెం మండల పరిధిలోని 13 ఉన్నత పాఠశాలలకు సంబంధించిన 1200 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందిస్తున్నారు. ఈక్రమంలో గురువారం స్థానిక ఎస్అండ్‌పీఎం ఉన్నత పాఠశాలలో అల్పాహారం అందించారు.

ఈసందర్భంగా హాజరయిన ఎంఈవో సుబ్ర హ్మణ్యేశ్వరరావు విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ప్రతిఒక్కరూ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని లక్ష్యాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

